పార్లమెంట్‌లో ప్రజల గొంతుకనవుత

- 30 ఏండ్ల రాజకీయ జీవితంలో మచ్చలేని నాయకుడిని
- సింగరేణి కార్మిక నేతగా రాజకీయ ప్రస్థానం
- ఏసీల్లో ఉండేవారికి కార్మికుల కష్టాలేం తెలుసు ?
- బీఆర్‌ఎస్‌తోనే సింగరేణి సమస్యలు పరిష్కారం
- పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

నమస్తే తెలంగాణ ప్రత్యేక ఇంటర్వ్యూ

పెద్దపల్లి, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): 'రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్రంలో అధికారంలోకి వచ్చే ఏ ప్రభుత్వంతోనైనా పోరాడి పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని ప్రజా సమస్యలు పరిష్కరిస్తా. పార్లమెంట్‌లో ప్రజల గొంతుకనవుతా. 30 ఏండ్ల సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎలాంటి ఆరోపణ, మచ్చలేని నాయకుడిగా ఎదిగా. ఇక్కడ పోటీ చేస్తున్న వాళ్లంతా ఎన్నికల ముందు వచ్చి, ఎన్నికల తరువాత కనిపించకుండా వెళ్లిపోయే వారే. పార్లమెంట్ పరిధిలోని ప్రతి కుటుంబంతో నాకు ఆత్మీయ అనుబంధం ఉంది' అని బీఆర్ఎస్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. ఆదివారం పెద్దపల్లి జిల్లా మంథనిలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన సందర్భంగా 'నమస్తే తెలంగాణ'తో ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ..

ఎన్నికల ప్రచారం ఎట్లున్నది ?

పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం అంటే కార్మిక, కర్షక క్షేత్రం. నేను ఇక్కడే పుట్టి, ఇక్కడే పెరిగి, ప్రజల మధ్యే సింగరేణి కార్మిక నేతగా ఎదిగి రాజకీయాల్లోకి వచ్చా. ఓ కార్మిక బిడ్డగా నన్ను ప్రతి చోట గొప్పగా ఆదరిస్తున్నారు. ఆరు సార్లు ఎమ్మెల్యేగా, ప్రభుత్వ విప్‌గా, మంత్రిగా పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గ ప్రజలకు సేవ చేశా. 30 ఏండ్ల రాజకీయ జీవితంలో మచ్చలేని నాయకుడిగా, దళిత వర్గాల నుంచి ఎదిగిన బిడ్డగా ఉన్న నాకు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అవకాశం ఇచ్చారు.

ప్రత్యర్థి పార్టీ అభ్యర్థులపై మీ కామెంట్ ?

ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీల నుంచి పోటీ చేస్తున్న నాయకులకు పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని ప్రజలకు ఎలాంటి సంబంధాలు లేవు. కార్మికులు, కర్షకుల కష్టాలపై వాళ్లకు అవగాహన లేదు. వనరులు, అభివృద్ధి, సంక్షేమంపై కనీసం సమాచారం కూడాలేదు. కార్పొరేట్ లైఫ్ స్టైల్‌లో ఉండే వీరంతా ఏసీ రూంల్లో ఉండి వ్యాపారాలు చూసుకునే వారు. కేవలం డబ్బు సంచులతో మాత్రమే పెద్దపల్లి పార్లమెంట్‌లో రాజకీయం చేస్తూ ఓట్లను దండుకోవాలని చూస్తున్నారు.

సింగరేణిని ప్రైవేట్ పరం చేయాలనే బీజేపీ ప్రయత్నంపై మీ కామెంట్?

సింగరేణిని ప్రైవేట్ పరం చేయవద్దని రాష్ట్ర పర్యటనకు వచ్చినప్పుడు స్వయంగా ప్రధానమంత్రిని కోరితే నాలుగు రోజులు తిరగకముందే నోటిఫికేషన్ ఇచ్చి ప్రైవేట్‌కు అప్పగించారు. బీజేపీ విధానమే పేద ప్రజలకు వ్యతిరేకమైన విధానం. కోచ్ ఫ్యాక్టరీ, ఉక్కు కర్మాగారం వంటి వాటిని ఇవ్వని పార్టీ. ఐటీఆర్‌ను బెంగుళూర్‌కు తరలించుకుపోయిన, కోచ్‌ఫ్యాక్టరీని గుజరాత్‌కు తరలించిన పార్టీ. తల్లిని చంపి బిడ్డను బతికించిందని తెలంగాణ ఏర్పాటుపై అక్కసు కక్కిన వ్యక్తి ప్రధాని మోదీ. ఇటువంటి వాళ్లు తెలంగాణను ఏమి చేయరు. తెలంగాణపై సవతి తల్లి ప్రేమ వారిది, కన్నతల్లి ప్రేమ బీఆర్‌ఎస్‌ది.

మీరు గుర్తించిన ఢిల్లీ స్థాయి సమస్యలు ?

ఢిల్లీ స్థాయిలో పరిష్కరించాల్సిన సమస్యలు అనేకం ఉన్నాయి. సింగరేణి కార్మికులకు ఇన్‌కమ్ ట్యాక్స్ మినహాయింపు, పెన్షన్ విధానం, పెద్దపల్లి రైల్వే జంక్షన్‌లో అన్ని సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ల నిలుపుదల, పెద్దపల్లి జిల్లా కేంద్రం నుంచి హన్మకొండ దాకా జాతీయ రహదారి నిర్మాణం, జగిత్యాల-ధర్మారం, పెద్దపల్లి-మంథని, మంథని-కాళేశ్వరం రహదారిని నాలుగు వరుసల రహదారిగా విస్తరించడం, పెద్దపల్లి జిల్లాలో నవోదయ, కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటు, సుల్తానాబాద్‌లో రైల్వే డ్రై పోర్టు నిర్మాణం, బసంత్‌నగర్ విమానాశ్రయ పునరుద్ధరణ, రామగిరిఖిల్లా అభివృద్ధి, రూప్‌వే నిర్మాణం, రామగుండం, మణుగూరు వయా మంథని మీదుగా నూతన రైల్వే మార్గం, పెద్దపల్లి నుంచి నిజామాబాద్ వయా కరీంనగర్ సింగిల్ రైల్వే మార్గాన్ని డబుల్ రైల్వే మార్గంగా విస్తరించడం, ప్రముఖ ఆలయాలు ధర్మపురి, కాళేశ్వరం, ఓదెలలోని ఆలయాలను ప్రసాద్ పథకంలో చేర్చడం, సింగరేణి కార్మికుల సొంతింటి కల, క్వార్టర్లను సొంతం చేయడం, కాంట్రాక్టు, డిపెండెంట్ కార్మికులకు చదువుకు తగ్గట్టుగా ఉద్యోగాలు. నేను ఎంపీగా గెలిచిన వెంటనే ఈ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తా.

కుటుంబ పాలన, వారసత్వ రాజకీయాలు అని విమర్శించే వారికి మీరు ఏం చెప్తారు..?

కాంగ్రెస్ పార్టీలోని వివేక్ కుటుంబం మొన్నటిదాక కేసీఆర్‌ను కుటుంబ పాలన అన్నారు. ఒక పార్లమెంట్ పరిధిలోని నాలుగు అవకాశాలు ఉంటే అందులో మూడు ఒకే ఇంట్లో ఇచ్చారు. అంబేద్కర్ చెప్పినట్టు రిజర్వేషన్ అనేది ఒక ఎదుగుదల తర్వాత తప్పుకుండా మిగతా వారికి అవకాశం ఇవ్వాలి. దేశంలోనే శ్రీమంతుల జాబితాలో 9వ నెంబర్‌గా ఉన్న వాళ్లు రిజర్వేషన్ల కోటాలోనే పోటీ ఎందుకు ? రాజకీయాలపై ఆసక్తి ఉంటే ఎక్కడైనా జనరల్ స్థానాల్లో పోటీ చేయవచ్చు. మాదిగ సామాజిక వర్గం వాళ్లు ఈ ప్రాంతం నుంచి కాంగ్రెస్ టికెట్ కావాలని కోరినా పట్టించుకోలేదు. బీఆర్‌ఎస్ సామాజిక న్యాయాన్ని పాటించింది. రాష్ట్రంలో మూడు రిజర్వేషన్ నియోజకవర్గాలు ఉంటే రెండు చోట్ల మాదిగలకు, ఒకటి మాల సామాజికవర్గానికి ఇచ్చింది. కాంగ్రెస్ డబ్బులకు లొంగి ఇదే సామాజికవర్గానికి ద్రోహం, అన్యాయం చేసింది.

రాజ్యాంగాన్ని మార్చేస్తామన్న బీజేపీ ప్రచారంపై మీ సమాధానం..?

అంబేద్కర్ రచించిన రాజ్యాంగం దేశంలోని సకల జనుల సంక్షేమానికి దోహదం చేస్తున్నది. 400 మంది ఎంపీలు గెలిస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని బీజేపీ చెప్తున్నది. అలా చేయడం వల్ల ప్రధానంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు తీవ్రంగా నష్టపోతాయి. వాళ్ల అస్తిత్వాన్ని కోల్పోతారు. కాబట్టి ఈ వర్గాలకు ఎట్టి పరిస్థితుల్లో బీజేపీకి ఓటు వేసే ప్రయత్నం చేయవద్దు. అదే విధంగా ఒక్క వాగ్దానాన్ని కూడా అమలు చేయకుండా విర్రవీగి మాట్లాడుతున్న కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాత పెట్టాలి. ఈ రెండు పార్టీలకు ఎన్నికల్లో ఓటుతో గుణపాఠం చెప్పాలి.

ఎస్సీ వర్గీకరణపై బీఆర్‌ఎస్ కార్యాచరణ ?

ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించాం. నిర్ణయం కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉంది. ఎస్సీ వర్గీకరణ విషయంలో కావాలనే కేంద్రం మభ్యపెడుతుంది. ఎస్టీ రిజర్వేషన్ల విషయంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం గతంలో అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపింది. బీసీ కులగణన విషయంలో కూడా బీఆర్‌ఎస్ చిత్తశుద్ధితో పని చేసింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నది. బీజేపీ ప్రభుత్వం ఉన్నంత కాలం ఈ వర్గాలు నష్ట పోవాల్సిందే.

అబద్ధాల రేవంత్‌ను అరెస్టు చేయాలి

- గోబెల్స్ ప్రచారంపై సీఎంకు ఢిల్లీ పోలీసుల నోటీసులు
- పాపం పండింది.. బీఆర్‌ఎస్‌పైనా అబద్ధాలు ప్రచారం
- అరెస్టు చేయకపోతే మోదీ, రేవంత్ ఒక్కటేనని తేలిపోతుంది
- సదాశివపేట రోడ్‌షోలో మాజీమంత్రి హరీశ్‌రావు

సదాశివపేట రోడ్‌షోలో మాట్లాడుతున్న మాజీమంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

సంగారెడ్డి, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): 'ఫేక్ వీడియోల ఆధారంగా అబద్ధాలు ప్రచారం చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి ఢిల్లీ పోలీసులు నోటీసులు ఇచ్చారు. గోబెల్స్ ప్రచారం చేసినందుకు వెంటనే పోలీసులు ఆయనను అరెస్టు చేయాలి' అని మాజీమంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి గెలుపు కోసం బీఆర్‌ఎస్ రోడ్‌షో నిర్వహించింది. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన హరీశ్ మాట్లాడుతూ.. ఫేక్ వీడియో ప్రచారంపై బుధవారం (మే 1న) ఢిల్లీ రావాలని అక్కడి పోలీసులు నోటీసులు ఇచ్చారని, రేవంత్ పాపం పండిందని అన్నారు. ఫేక్ వీడియోల ద్వారా అబద్ధపు ప్రచారం చేసినందుకు అస్సాంలో ఒకరిని పోలీసులు అరెస్టు చేశారని, అదే తరహాలో రేవంత్‌రెడ్డిని కూడా అరెస్టు చేయాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డిని అరెస్టు చేయకపోతే ప్రధాని మోదీ, సీఎం రేవంత్‌రెడ్డి కలిసిపోయినట్టు తేలిపోతుందని వ్యాఖ్యానించారు. బీఆర్‌ఎస్‌పైనా రేవంత్ అబద్ధాలు ప్రచారం చేశారని ఆరోపించారు. అబద్ధాల పునాదులపై రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చారని విమర్శించారు.

కాంగ్రెస్‌వి ప్రామిసరీ నోట్లు.. గాడ్ ప్రామిస్‌లు

ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 13 హామీలు అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని హరీశ్ అన్నారు. ఎన్నికల ముందు ప్రామిసరీ నోట్లతో ఓట్లు వేయించుకొని మోసం చేసిన ఆ పార్టీ.. ఇప్పుడు గాడ్ ప్రామిస్‌లతో మరోసారి మోసం చేయాలని చూస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకు రూ.2,500, రూ.4 వేల ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి ద్వారా తులం బంగారం, నిరుద్యోగభృతి ఇస్తామని ఇవ్వకుండా ప్రజలను మోసం చేసిందని దుయ్యబట్టారు. ప్రభుత్వం గ్యారెంటీలను అమలు చేయాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు. బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే ప్రజల తరపున పోరాడి ఆరు గ్యారెంటీలు, 13 హామీలు అమలయ్యేలా చూస్తుందని తెలిపారు. అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీసే బలం వస్తుందని వెల్లడించారు. సంగారెడ్డి ప్రాంత ప్రజలు బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని విన్నవించారు. మాజీ ఐఏఎస్ అయిన వెంకట్రామిరెడ్డి ప్రజల కోసం పనిచేస్తారని, రూ.100 కోట్ల ట్రస్టు ఏర్పాటు చేసి పేదలకు మెరుగైన విద్యావకాశాలు అందుబాటులోకి తీసుకువస్తారని వివరించారు. దేవుడిని అడ్డం పెట్టుకొని బీజేపీ అధికారంలోకి వచ్చే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. దుబ్బాక ప్రజలకు అలవికాని హామీలు ఇచ్చి ఒక్కటీ నెరవేర్చకుండా ఎమ్మెల్యేగా ఓడిపోయిన రఘునందన్‌రావు ఇప్పుడు కొత్త హామీలు ఇస్తూ ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ మెదక్ ఎంపీగా తనను గెలిపిస్తే పార్లమెంట్ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రోడ్‌షోలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, బీఆర్‌ఎస్ నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, శివకుమార్, రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే, రాజేందర్, శివరాజ్‌పాటిల్, కోడూరి రమేశ్, చీలమల్లన్న తదితరులు పాల్గొన్నారు.

బీసీల అభ్యున్నతిపై బీజేపీ వైఖరి తేల్చాలి

ప్రధాని మోదీకి 16 బీసీ సంఘాల డిమాండ్

హైదరాబాద్, ఏప్రిల్29 (నమస్తే తెలంగాణ): బీసీల అభ్యున్నతిపై బీజేపీ తన వైఖరిని తేల్చాలని ప్రధాని మోదీకి రాష్ట్రంలోని 16 బీసీ సంఘాలు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నాయి. పదేండ్ల పాలనలో బీసీల అభివృద్ధికి ఏ ఒక్క పథకం అమలు చేయలేదని తెలిపారు. కులగణన చేపట్టేందుకు ఎందుకు ఒప్పుకోవడం లేదని, బీసీలకు విద్య, ఉద్యోగ రిజర్వేషన్లను 50 శాతానికి ఏ కారణంతో పెంచడం లేదని, చట్టసభల్లో బీసీ రిజర్వేషన్లను ఎందుకు వ్యతిరేకిస్తున్నదని, బడ్జెట్లో బీసీల కోసం రూ.2 లక్షలు కేటాయించాలని, స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్, హాస్టళ్ల, గురుకుల పాఠశాలలు పెట్టాలని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. జాతీయ బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలను ఎందుకివ్వడం లేదని, కేంద్ర ప్రభుత్వంలో 16 లక్షల ఉద్యోగ ఖాళీలను ఎందుకు భర్తీ చేయడం లేదని, అగ్రకులాల పేదలు 3శాతం ఉంటే ఎందుకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య, కన్వీనర్ గుజ్జ కృష్ణ, నేతలు వెంకటేశ్, రామకృష్ణ, అనంతయ్య, రాజేందర్, కృష్ణయాదవ్, రామాంజనేయులు, మల్లేశ్‌యాదవ్, నర్సింహాగౌడ్, అంజి, బర్క కృష్ణ, వెంకన్నగౌడ్, మధుసూదన్, వెంకన్న, చంద్ర నిలదీశారు.

ఎన్నికల బరిలో 525 మంది

- సికింద్రాబాద్ బరిలో 45 మంది
- ఆదిలాబాద్ బరిలో 12 మంది
- ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ

హైదరాబాద్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మే 13న జరగనున్న పార్లమెంటు ఎన్నికలకు సోమవారం సాయంత్రం మూడు గంటలకు నామినేషన్ల ఉపసంహరణ పర్వం ముగిసింది. 17 స్థానాలకుగాను 525 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ అన్ని స్థానాల్లో బరిలో ఉండటంతో ఈసారి త్రిముఖ పోటీ నెలకొన్నది. ఏప్రిల్ 18 నుంచి 25 వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగగా, మొత్తం 893 నామినేషన్లు వచ్చాయి. వీటిలో కొందరు రెండు సెట్లు, మూడు సెట్ల నామినేషన్లు కూడా సమర్పించారు. 26న నామినేషన్ల పరిశీలన తర్వాత 625 మంది పోటీలో ఉన్నట్టు ఎన్నికల అధికారులు తేల్చారు. గడువు తేదీ సోమవారం వరకు 100 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీకి చెందిన అభ్యర్థులుసహా మొత్తం 525 మంది అభ్యర్థులు పోటీలో మిగిలారు. సికింద్రాబాద్ స్థానంలో అత్యధికంగా 45 మంది, ఆదిలాబాద్ ఎస్టీ రిజర్వు స్థానంలో అత్యల్పంగా 12 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. సికింద్రాబాద్‌తోపాటు మెదక్, పెద్దపల్లి, చేవెళ్ల, వరంగల్ (నాలుగు) స్థానాల్లో 40 మందికిపైగా అభ్యర్థులు బరిలో ఉండటం విశేషం. ఆదిలాబాద్‌తోపాటు జహీరాబాద్, నాగర్‌కర్నూల్ స్థానాల్లో 20 కన్నా తక్కువ మంది పోటీలో ఉన్నారు. మే 13న పోలింగ్ జరుగనుండగా, జూన్ 4న ఫలితాలు వెల్లడి కానున్నాయి. దాదాపు అన్ని స్థానాల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు హోరాహోరీ తలపడుతున్నారు. అన్ని పార్టీలూ స్థానిక పరిస్థితులు, కుల సమీకరణలు తదితర అంశాలను బేరీజు వేసుకొని అభ్యర్థులను ఎంపికచేసిన విషయం తెలిసిందే.

పార్లమెంటు స్థానాలవారీగా బరిలో ఉన్న అభ్యర్థులు

క్ర.సం.	పార్లమెంటు స్థానం	మొత్తం నామినేషన్లు	ఉపసంహరణ	బరిలో ఉన్నవారు
1	ఆదిలాబాద్ (ఎస్టీ)	13	1	12
2	పెద్దపల్లి (ఎస్సీ)	49	7	42
3	కరీంనగర్	33	5	28
4	నిజామాబాద్	32	3	29
5	జహీరాబాద్	26	7	19
6	మెదక్	53	9	44
7	మల్కాజిగిరి	37	15	22
8	సికింద్రాబాద్	46	1	45
9	హైదరాబాద్	38	8	30
10	చేవెళ్ల	46	3	43
11	మహబూబ్‌నగర్	35	4	31
12	నాగర్‌కర్నూల్ (ఎస్సీ)	21	2	19
13	నల్లగొండ	31	9	22
14	భువనగిరి	51	12	39
15	వరంగల్ (ఎస్సీ)	48	6	42
16	మహబూబాబాద్ (ఎస్టీ)	25	2	23
17	ఖమ్మం	41	6	35
మొత్తం		625	100	525

పోటీలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థులు

నియోజకవర్గం	బీఆర్ఎస్	కాంగ్రెస్	బీజేపీ
ఆదిలాబాద్	ఆత్రం సక్కు	ఆత్రం సుగుణ	జీ నగేశ్
పెద్దపల్లి	కొప్పుల ఈశ్వర్	గడ్డం వంశీ	గోమాస శ్రీనివాస్
నిజామాబాద్	బాజిరెడ్డి గోవర్ధన్	టీ జీవన్‌రెడ్డి	ధర్మపురి అరవింద్
కరీంనగర్	బోయినపల్లి వినోద్‌కుమార్	వీ రాజేందర్ రావు	బండి సంజయ్
మెదక్	పీ వెంకట్రామిరెడ్డి	నీలం మధు	ఎం రఘునందన్‌రావు
జహీరాబాద్	గాలి అనిల్‌కుమార్	సురేశ్ షెట్కార్	బీబీ పాటిల్
మల్కాజిగిరి	రాగిడి లక్ష్మారెడ్డి	పీ సునీతారెడ్డి	ఈటల రాజేందర్
చేవెళ్ల	కాసాని జ్ఞానేశ్వర్	జీ రంజిత్‌రెడ్డి	కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
సికింద్రాబాద్	టీ పద్మారావుగౌడ్	దానం నాగేందర్	జీ కిషన్‌రెడ్డి
హైదరాబాద్	గడ్డం శ్రీనివాస్‌యాదవ్	ఎండీ వలీఉల్లాల్ సమీర్	మాధవీలత
మహబూబ్‌నగర్	మన్నె శ్రీనివాస్‌రెడ్డి	సీహెచ్ వంశీచంద్‌రెడ్డి	డీకే అరుణ
నాగర్‌కర్నూలు	ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్	మల్లు రవి	పీ భరత్‌కుమార్
నల్లగొండ	కంచర్ల కృష్ణారెడ్డి	కే రఘువీర్‌రెడ్డి	ఎస్ సైదిరెడ్డి
భువనగిరి	క్యామ మల్లేశ్	సీహెచ్ కిరణ్‌కుమార్‌రెడ్డి	బూర నర్సయ్య
వరంగల్	ఎం సుధీర్‌కుమార్	కడియం కావ్య	ఆరూరి రమేశ్
మహబూబాబాద్	మాలోతు కవిత	బలరాంనాయక్	సీతారాంనాయక్
ఖమ్మం	నామా నాగేశ్వర్‌రావు	ఆర్ రఘురాంరెడ్డి	టీ వినోద్‌రావు

ధరూరు మండలం కోతులగిద్ద స్టేజీ వద్ద కూలీలతో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కారే మాకు బతుకు.. కేసీఆరే మా భరోసా

- కేసీఆర్ ఉంటేనే.. టంచన్‌గా పింఛన్, రైతుబంధు
- తప్పు దిద్దుకునే అవకాశం వచ్చింది.. కారు గుర్తుకే మా ఓటు
- నాగర్‌కర్నూల్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్పీతో ఉపాధి కూలీలు

ధరూరు, ఏప్రిల్ 29: కారే మాకు బతుకు, కేసీఆరే మా భరోసా అని ఉపాధిహామీ కూలీలు పేర్కొన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లాలోని గద్వాల, ధరూరు, గట్టు, మల్దకల్, కేటీదొడ్డి మండలాల్లో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధరూరు మండలంలోని కోతులగిద్ద స్టేజీ వద్ద ఉపాధి పనులు చేస్తున్న కూలీలను కలిసి ముచ్చటించారు. 'వ్యవసాయం బాగుందా.. పింఛన్ వస్తుందా?' అని కూలీలను అడిగారు. 'ఎక్కడయ్యా.. కేసీఆర్ సారు ఉన్నన్ని రోజులు భూములన్నీ పంటపొలాలతో కళకళలాడేవి.. రైతుబంధు, పింఛన్లు సక్కగా వచ్చేవి. ఏదో మా దురదృష్టం కొద్ది ఆయన అధికారంలో లేడు. అప్పటి నుంచి కష్టాలు మొదలయ్యాయి. ఆ తప్పును సరిదిద్దుకొనే అవకాశం ఈ ఎన్నికల రూపంలో వచ్చింది. బండ్ల కృష్ణమోహన్‌రెడ్డినే మా ధైర్యం.. కారు గుర్తుకు తప్ప దేనికీ ఓటేయం.. మీరు ధైర్యంగా ఉండండి.. ఈసారి ఎన్నికల్లో మీదే విజయం' అని కూలీలు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు భరోసానిచ్చారు.

ఎన్నికల్లో కాంగ్రెస్‌ది మూడో స్థానమే

- రేవంత్ నోరు అదుపులో పెట్టుకో
- రెచ్చగొట్టే ప్రసంగాలకు కాలం చెల్లింది
- కేసీఆర్ ముందు రేవంత్ అనుభవం ఎంత?: పొన్నాల

హైదరాబాద్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌కు దక్కేది మూడో స్థానమేనని మాజీమంత్రి, బీఆర్‌ఎస్ సీనియర్ నేత పొన్నాల లక్ష్మయ్య తేల్చి చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో హోంవర్క్, టీంవర్క్ రెండూ లేవని, తాత్కాలిక ఉద్రేకాలు, రెచ్చగొట్టే ప్రసంగాలకు ఎప్పుడో కాలం చెల్లిందని పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ వద్దని రేవంత్‌రెడ్డి తుపాకులు పట్టుకుని తిరుగుతుంటే, కేసీఆర్ కొట్లాడి రాష్ట్రాన్ని తెచ్చుకున్నారని గుర్తు చేశారు. అలాంటి వ్యక్తిపై నోరు జారితే బాగుండదని, ఖబడ్దార్ అని హెచ్చరించారు. రేవంత్ ఇకనైనా నోరు అదుపులో పెట్టుకోవాలని హితవు పలికారు. ప్రజల మద్దతు కోల్పోయిన రేవంత్‌రెడ్డి తిట్లు, శాపనార్థాలు, దేవుళ్లపై ఒట్లు వేస్తూ మరోమారు ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. 60 లక్షలకుపైగా సభ్యత్వం కలిగి అసెంబ్లీ ఎన్నికల్లో 1.85 శాతంతో ఓడిన బీఆర్ఎస్ చచ్చినపాము ఎలా అవుతుందో చెప్పాలని నిలదీశారు. బస్సుయాత్రతో కేసీఆర్‌కు ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి సీఎం తట్టుకోలేకపోతున్నారని పేర్కొన్నారు.

కేసీఆర్‌ను అనేందుకు సిగ్గుండాలి

కేసీఆర్ అనుభవం ముందు రేవంత్‌రెడ్డి అనుభవం ఎంత అని ప్రశ్నించిన పొన్నాల.. పార్లమెంట్, అసెంబ్లీకి ఎక్కువసార్లు గెలిచిన చరిత్ర కేసీఆర్‌కు ఉందని గుర్తుచేశారు. ఎమ్మెల్యేగా 9సార్లు, ఎంపీగా ఐదుసార్లు గెలిచిన చరిత్ర కేసీఆర్‌కు దక్కిందని చెప్పారు. ఇప్పటి వరకు కేసీఆర్ 14సార్లు చట్టసభలకు ఎన్నికయ్యారని, పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలకు కలిపి అత్యధికంగా గెలిచిన వ్యక్తి కేసీఆర్ ఒక్కరేనని గుర్తుచేశారు. రెండుసార్లు మంత్రిగా, డిప్యూటీ స్పీకర్‌గా, కేంద్రమంత్రిగా, రెండుసార్లు సీఎంగా కేసీఆర్ పనిచేశారని, ఆయన ముందు రేవంత్ అనుభవం ఎంతని ప్రశ్నించారు. కేసీఆర్‌ను అనేముందు సిగ్గుండాలని, తలవంచుకోవాలని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని ముంచాలనుకుంటున్న వ్యక్తి సీఎంగా పనికిరాడని, అబద్ధాలకోరు రేవంత్ రాజకీయాల నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు.

వందరోజుల్లోనే బయటపడిన గుట్టు

అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే రేవంత్ గుట్టు బయటపడిందని, రైతుబంధు, రుణమాఫీ చేయలేని సీఎంగా ఆయన మిగిలిపోయారని పొన్నాల ఎద్దేవా చేశారు. రైతుబంధు రాని 5 లక్షల మంది ఓటుతో దెబ్బకొడితే ఎక్కడ పడతాడో రేవంత్ ఆలోచించుకోవాలని సూచించారు. తెలంగాణ గొంతును బలంగా వినిపించేందుకు పార్లమెంట్‌లో బీఆర్ఎస్ ఎంపీలు ఉండాలని పేర్కొన్నారు. నేటికీ ధాన్యం కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. పంటనష్టాన్ని అంచనా వేయలేదని, కరువు పరిస్థితులపై అధ్యయనం చేయలేదని మండిపడ్డారు. కాళేశ్వరంపై ఎవరు, ఎప్పుడు, ఎందుకు మాట్లాడుతున్నారో అన్నీ తమకు తెలుసని చెప్పారు. ఇకనైనా సంకుచిత రాజకీయాలు పక్కనపెట్టాలని హితవు పలికారు. ప్రజలకు మేలు చేయాలంటే కేసీఆర్‌కు ఉన్నటువంటి దూరదృష్టి ఉండాలని, ఇప్పుడు అధికారంలో ఉన్న చిల్లరగాళ్లకు అలాంటి దూరదృష్టి లేదని పొన్నాల విమర్శించారు.

అన్నపూర్ణ తెలంగాణ

ఆహార ధాన్యాల ఉత్పత్తి వృద్ధిరేటులో టాప్

- 11.6%తో దేశంలోనే అగ్రస్థానం
- జాతీయ సగటు 3.228 శాతమే
- పెద్ద రాష్ట్రాలూ తెలంగాణ వెనుకే



హైదరాబాద్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): అది 2014.. తెలంగాణ చేయిచాచి అన్నమో రామచంద్రా! అన్న దుస్థితి. సరిగ్గా తొమ్మిదేండ్లకు దేశానికే అన్నం పెట్టే స్థాయికి చేరింది. ఏ రాజకీయ నాయకుడో చెప్పిన మాట కాదిది. భారతీయ రిజర్వు బ్యాంక్ (ఆర్బీఐ) అధికారిక గణాంకాలతో సహా నిరూపించిన నిజం. ఇది కదా! ప్రగతి అంటే. ఇది కదా! అభివృద్ధి అంటే. ఇది కదా! సంక్షేమమంటే. అవును! కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ వ్యవసాయానికి సాటి, పోటీ లేదని మరోసారి నిరూపితమైంది. దేశ వ్యవసాయ రంగానికి తెలంగాణ దిక్సూచిగా నిలిచింది. దేశంలో ఆహారధాన్యాల ఉత్పత్తి వృద్ధిరేటులో తెలంగాణ అగ్రభాగాన నిలిచింది. 2014-15తో పోల్చితే 2021-22 నాటికి తెలంగాణ 11.6 శాతం వృద్ధిరేటును నమోదు చేసింది. ఈ విషయాన్ని హ్యాండ్ బుక్ ఆఫ్ స్టాటిస్టిక్స్‌లో ఆర్బీఐ వెల్లడించింది. ఈ ఉత్పత్తి వృద్ధిరేటులో తెలంగాణ మరే రాష్ట్రానికి అందనంత ఎత్తులో ఉన్నది. విస్తీర్ణం, జనాభాపరంగా పెద్దవైన రాష్ట్రాలూ తెలంగాణకు దరిదాపుల్లో లేవు. వ్యవసాయ రాష్ట్రాలైన పంజాబ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లోనూ ఆహారధాన్యాల వృద్ధిరేటు తక్కువే. తెలంగాణ వృద్ధి రేటు మాత్రం జాతీయ సగటు కన్నా అధికంగా ఉన్నది. జాతీయ సగటు వృద్ధి రేటు 3.228 శాతమే కాగా, తెలంగాణ దాదాపు మూడింతల రెట్టింపు వృద్ధిరేటును నమోదు చేసింది.

పెరిగిన సేద్యం.. మెరిసిన రాష్ట్రం

కాళేశ్వరం ప్రాజెక్ట్ అందుబాటులోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. మిషన్ కాకతీయతో భూగర్భ జలాలు భారీగా పెరిగాయి. పాలమూరు రంగారెడ్డి పథకంతో పాలమూరు పచ్చబడింది. ఇలా కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న అనేక సంస్కరణల ఫలితంగా రాష్ట్రంలో సాగు విస్తీర్ణం పెరిగింది. 2014లో రాష్ట్రంలో పంటల సాగు విస్తీర్ణం 1.31 కోట్ల ఎకరాలు మాత్రమే ఉండగా, 2022-23 నాటికి అది ఏకంగా 2.38 కోట్ల ఎకరాలకు పెరిగింది. అంటే ఈ తొమ్మిదేండ్లల్లో రాష్ట్రంలో ఏకంగా కోటి ఎకరాలకు పైగా సాగు విస్తీర్ణం పెరిగింది. ఇక ధాన్యం ఉత్పత్తి 2014లో కేవలం 68 లక్షల టన్నులు మాత్రమే ఉండగా, 2022-23 నాటికి ఇది 2.5 కోట్ల టన్నులకు చేరింది. అంటే దాదాపు 1.8 కోట్ల టన్నులు పెరిగింది.

ఆహారధాన్యాల వృద్ధిరేటు (టన్నుల్లో)

రాష్ట్రం	2014-15	2021-22
తెలంగాణ	71.14 లక్షలు	1.53 కోట్లు
పంజాబ్	2.66 కోట్లు	2.82 కోట్లు
ఒడిశా	89.80 లక్షలు	95.23 లక్షలు
ఛత్తీస్‌గఢ్	74.63 లక్షలు	90.23 లక్షలు
ఏపీ	1.04 కోట్లు	1.10 కోట్లు
హర్యానా	1.52 కోట్లు	1.62 కోట్లు
మధ్యప్రదేశ్	2.86 కోట్లు	3.93 కోట్లు
మహారాష్ట్ర	1.13 కోట్లు	1.66 కోట్లు
ఉత్తరప్రదేశ్	5.00 కోట్లు	5.61 కోట్లు

కవులు, మేధావులపై దాడి హేయం

- కాకతీయ వర్సిటీ ఘటనను ఖండిస్తున్నాం : తమ్మినేని
- భౌతికదాడులు శోచనీయం : వంగపల్లి శ్రీనివాస్
- ప్రజల స్వేచ్ఛపై దాడి : ఎర్రోజు

హైదరాబాద్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ)/ముషీరాబాద్, ఏప్రిల్ 29: కాకతీయ వర్సిటీలో ఆదివారం సెక్యులర్ రైటర్స్ ఫోరం (సమూహ) ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో రచయితలు, మేధావులు, ప్రజాస్వామ్యవాదులపై జరిగిన భౌతికదాడులను సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఖండించారు. సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో సదస్సు జరుగుతు న్న సమయంలో ఏబీవీపీ కార్యకర్తలు బ్యానర్లు చించివేసి, అసభ్య పదజాలంతో దూషిస్తూ వారి నుం చి పుస్తకాలను లాగేసుకోవడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి, రాష్ట్ర కార్యదర్శి టీ నాగరాజు ఏబీవీపీ దాడిని ఖండిస్తున్నట్టు ప్రకటన విడుదల చేశారు. భావ ప్రకటన స్వేచ్ఛను హరి స్తూ కవులు, మేధావులు, రచయితలపై మతోన్మాదులు భౌతికదాడులు చేయడం శోచనీయమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మండిపడ్డారు. సోమవారం విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయం లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాకతీయ వర్సిటీలో జరిగిన దాడి ప్రజల స్వేచ్ఛపై జరిగిన దాడిగా భావిస్తున్నట్టు తెలంగాణ వికాస సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోజు శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో భౌతిక దాడుల సంస్కృతి మంచిది కాదని తెలిపారు.